సాక్షి అనకాపల్లి
మంగళవారం : 21 : ఫిబ్రవరి : 2023



త్వరితగతిన అర్జీల పరిష్కారం

స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జేసీ, డీఆర్వో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు స్వీకరించారు. 8లో



కనకమహాలక్ష్మి హుండీ లెక్కింపు

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానం హుండీల లెక్కింపులో రూ.37 లక్షల 89 వేల 624 వచ్చినట్లు ఈవో కె.శిరీష తెలిపారు.



క్షీరాభిషేకం

విశాఖ: మత్స్యకార, ఎస్టీ నాయకులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించినందుకు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

రిమాండ్ ఖైదీలకు న్యాయసహాయం



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ (విశాఖ తూర్పు): రిమాండ్ ఖైదీలు న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.కె.బులికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన సెంట్రల్ జైలును సందర్శించారు. బెయిల్ మంజూరైనప్పటికీ జామీను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్న రిమాండ్ ఖైదీలతో ఆయన మాట్లాడారు. షరతుల సడలింపు కోసం న్యాయ సేవాధికారి సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు.

20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వాలీబాల్ పోటీల్లో తోటాడ విద్యార్థి ప్రతిభ



లాకేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

మునగపాక: తోటాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి అంగులూరి లాకేష్ అండర్-14 విభాగం వాలీబాల్ పోటీల్లో సత్తా చాటాడు. ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నరసరావుపేటలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. ఇందులో ప్రతిభ చాటిన లాకేష్‌ను స్థానిక హైస్కూల్‌లో సోమవారం హెచ్ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు అభినందించారు.

ఆలస్యంగా నడుస్తున్న పలు రైళ్లు



విశాఖ: పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్లలో సోమవారం బయల్దేరవలసిన పలు రైళ్లు రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. టాటానగర్‌లో ఉదయం 7.20 గంటలకు బయల్దేరవలసిన టాటానగర్- విశాఖపట్నం (20815) ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.50 గంటలకు బయల్దేరింది. సోమవారం సికింద్రాబాద్‌లో సాయంత్రం 4.50 గంటలకు గంటలకు బయల్దేరవలసిన సికింద్రాబాద్-భువనేశ్వర్ (17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.10గంటలకు బయల్దేరింది.

జ్యోతిర్లింగార్చన



వై.రామవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): పూతిగుంట పరమేశ్వరుని ఆలయం వద్ద మహాశివరాత్రి మహోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. శివదేవుడిని ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చిన వేలాదిమంది దర్శించుకున్నారు. సోమవారంతో ఉత్సవాలు ముగిశాయి. శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

331 పోలింగ్ కేంద్రాలు
3.17 లక్షల బ్యాలెట్ పేపర్లు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- ఇప్పటివరకు మూడు నామినేషన్ల దాఖలు
- 2,034 డూప్లికేట్ ఓట్ల తొలగింపు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ పత్రాలు, కోడ్ అమలు మొదలైన అంశాలపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్న అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే ఇప్పటివరకు మూడు నామినేషన్లు నమోదయ్యాయి. అల్లిపురం ప్రాంతానికి చెందిన కోడి శ్రీనివాసరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ కూడా అదే రోజున నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థి చిరంజీవిరావు నామినేషన్ ఎప్పుడు వేస్తారన్నది ఇంకా ఖరారు కాలేదు.

2,87,258 మంది ఓటర్లు

ఉత్తరాంధ్రలో యాక్సలరీ పోలింగ్ స్టేషన్లతో కలిపి మొత్తం 331 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకూ మొత్తం 2,87,258 మంది ఓటర్లున్నట్లు జాబితా సిద్ధం చేశారు. వీరికోసం అదనంగా 10 శాతం పత్రాలు, రౌండ్ ఫిగర్‌తో కలిపి మొత్తం 3,17,520 బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు రోజు కావడంతో.. ఆ రోజు సాయంత్రం తర్వాత బరిలో ఎంత మంది అభ్యర్థులున్నారన్నది ఖరారవుతుంది.

డూప్లికేట్ల ఏరివేత

పట్టభద్రుల ఓటర్ల నమోదుకు సంబంధించి పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జాబితాలోని ప్రతి ఒక్క పేరు, డాక్యుమెంట్లు నిశితంగా పరిశీలించాలంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశించిన నేపథ్యంలో డూప్లికేట్ల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 3,871 ఓట్లపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఇందులో 305 సుమోటాగా స్వీకరించారు. ఇందులో ఫారం-7కి సంబంధించి 2,034 ఓట్లు తొలగించారు. ఫారం-8లో 224 ఓట్లను సరిదిద్దారు. ఓటర్ల విషయంలోనే కాకుండా.. ఎన్నికల ప్రవర్తన నియమావళి విషయంలోనూ కట్టుదిట్టంగా వ్యవహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా పరిధిలో 11 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలుకు సంబంధించి 11 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాల్ని నియమించారు.

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం..

పట్టభద్రుల మండలి ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సీఈవో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ పూర్తిస్థాయిలో బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. క్లెయిమ్‌లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు కూడా పూర్తిచేశామన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణభారతి స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	సిద్ధం చేయనున్న బ్యాలెట్ పత్రాలు
శ్రీకాకుళం	59	52,196	57,710
విజయనగరం	72	58,382	64,510
పార్వతీపురం మన్యం	24	18,360	20,310
అల్లూరి సీతారామరాజు	15	11,571	12,810
విశాఖపట్నం	112	1,05,235	1,16,290
అనకాపల్లి	49	41,514	45,890
మొత్తం	331	2,87,258	3,17,520

విశ్వసనీయత.. విధేయత



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోలా గురువులు

కోలా గురువులు

ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసిన అభ్యర్థి

మత్స్యకార (వాడబలిజ) సామాజిక వర్గానికి చెందిన గురువులు 2009లో రాజకీయాల్లో ప్రవేశించారు. ప్రజారాజ్యం పార్టీ ద్వారా విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2012లో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ తరఫున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇప్పుడు శాసనమండలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించి మరోసారి మత్స్యకార సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు.



కుంభా రవిబాబును అభినందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

డాక్టర్ కుంభా రవిబాబు

గవర్నర్ కోటాలో సిఫార్సు చేసిన అభ్యర్థి

ఆంధ్రాయూనివర్సిటీలో 1989 నుంచి 2004 వరకు ప్రొఫెసర్‌గా పనిచేసిన కుంభా రవిబాబు.. దివంగత మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో ప్రవేశించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీలో చేరిన అనంతరం 2019లో పార్టీ అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులయ్యారు. పార్టీ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ ఎస్టీ కమిషన్ తొలి చైర్మన్‌గా సేవలందిస్తున్న రవిబాబును సీఎం ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిఫార్సు చేశారు.

- బీసీ, ఎస్టీ వర్గీయులకు ఎమ్మెల్సీ పదవులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇద్దరికి అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఎమ్మెల్యే కోటాలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును, గవర్నర్ కోటాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును పార్టీ అభ్యర్థులుగా ప్రతిపాదించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరికీ కీలక నామినేటెడ్ పదవులను అప్పగించిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఏకంగా చట్టసభకు ఎంపిక చేసి వారికి మరింత మెరుగైన అవకాశం కల్పించారు. ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదలకు నిరంతరం కృషి చేసిన కోలా గురువులును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మత్స్యకార, వాడబలిజ సామాజిక వర్గీయులు హర్షం తెలుపుతున్నారు. అదే విధంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రొఫెసర్ కుంభా రవిబాబును గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిఫార్సు చేయడంపై గిరిజనులు, మేధావులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచార సామాగ్రి వివరాలు తెలపాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏఆర్వో వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, సంబంధిత రాజకీయపార్టీలు తమ ప్రచార సామగ్రి వివరాలను తెలపాల్సిందిగా సహాయ రిటర్నింగ్ అధికారి(ఏఆర్వో), డీఆర్వో పి.వెంకటరమణ ఆయా పార్టీల ప్రతినిధులను సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. సీబీఎస్సీ పరీక్షల కారణంగా అనకాపల్లిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఉన్న 202, 203 పోలింగ్ కేంద్రాలను జ్యోతి బాలవిహార్-3కి తరలించినట్టు తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లు, హోర్డింగ్స్ అనుమతికి సంబంధిత యజమాని ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ నాగేశ్వరరావు(బీజేపీ), రాజాన దొరబాబు(సీపీఐ), అల్లు రాజు(సీపీఎం), బొలిశెట్టి శ్రీనివాసరావు(టీడీపీ)లు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ డిపాజిట్‌దారుడు అరెస్ట్

- సీడీఎంలో దొంగ నోట్లు డిపాజిట్ చేసిన ఘనుడు
- అకౌంట్‌లో జమ కాలేదని ఇచ్చిన ఫిర్యాదుతో బట్టబయలు

అనకాపల్లి టౌన్: తేలు కుట్టిన దొంగ నోరు మూసుకొని నిశ్శబ్దంగా ఉండాలి.. గోలగోల చేశాడు.. దొరికిపోయాడు.. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు యాక్సిస్ బ్యాంక్ డిపాజిట్ మిషన్ (సీడీఎం)లో నకిలీ రూ.500 నోట్లు డిపాజిట్ చేసిన వ్యక్తి పట్టణ పోలీసులకు విచిత్రంగా చిక్కాడు. చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన గుమ్మడి నిరంజన్(24)కు అనకాపల్లిలోని యాక్సిస్ బ్యాంక్‌లో సేవింగ్స్ ఖాతా ఉంది. ఈ నెల 12న అతను బ్యాంక్ డిపాజిట్ మిషన్లో రూ.500 నోట్లు 140 (రూ.70 వేలు) తీసుకెళ్లి, తన ఖాతాలో డిపాజిట్ చేశాడు. ఇందులో ఒరిజినల్ నోట్లు డిపాజిట్ కాగా, నకిలీ నోట్లు 48 (రూ.24 వేలు) డిపాజిట్ మిషన్ పక్క బాక్స్‌లోకి చేరాయి. ఈ నెల 14న నిరంజన్ బ్యాంక్‌కు వెళ్లి తన ఖాతాలో రూ.24 వేలు జమ కాలేదని బ్యాంక్ మేనేజర్ నారాయణశెట్టి గోవిందరావుకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు ఏటీఎం డిపాజిట్ మిషన్‌ను పరిశీలించగా.. పక్క బాక్స్‌లో 48 నకిలీ రూ.500 నోట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంక్ మేనేజర్ తన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 16న పట్టణ పోలీసులకు నిరంజన్‌పై ఫిర్యాదు చేశారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం గుమ్మడి నిరంజన్‌తో పాటు అదే గ్రామానికి చెందిన గాడి రాము (24) చీడికాడ నుంచి అనకాపల్లికి కారులో వస్తుండగా వారిని ఆపి, తనిఖీలు చేశారు. వారి వద్ద మరో 100 నకిలీ రూ.500 నోట్లు గుర్తించారు. నిరంజన్ గతంలో పలు గంజాయి కేసుల్లో ముద్దాయిగా జైలుశిక్ష అనుభవించినట్లు పట్టణ ఇన్‌చార్జి సీఐ టి.శ్రీను తెలిపారు. నిరంజన్, రాములపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

దంపతుల బ్రహ్మముడులు.. ముగిసిన తిరునాళ్లు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది



బ్రహ్మముడులు వేయించుకున్న దంపతులు

కళ్యాణపులోవ ఆదాయం రూ.14.60 లక్షలు

రావికమతం: మూడు రోజులపాటు కోలాహలంగా జరిగిన కళ్యాణపులోవ తిరునాళ్లు సోమవారం ముగిశాయి. ఈ నెల 18న శివరాత్రి రోజున 90 వేల మంది, 19న రెండు లక్షల మంది, 20న 10 వేల మంది భక్తులు తరలివచ్చినట్టు అంచనా వేస్తున్నారు. సోమవారం దంపతులు వేదపండితులతో బ్రహ్మముడులు వేయించుకుని స్నానమాచరించారు. భక్తుల ద్వారా ఈ ఏడాది రూ.14,60,102 ఆదాయం సమకూరినట్టు ఎండోమెంటు అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇందులో తలనీలాలు, కొబ్బరి చిప్పల ద్వారా రూ.2,25,500, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.1,82,925, హుండీల ద్వారా రూ.7,45,472, కేశ ఖండన ద్వారా రూ.54,975, దర్శన టికెట్ల ద్వారా రూ.2,51,230 ఆదాయం వచ్చిందన్నారు. ఈవో మురళీకృష్ణ, కొత్తకోట ఎస్ఐ విభీషణరావు పర్యవేక్షణలో 40 మంది శ్రీవారి భక్తులు లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 27 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 2,021 మంది హాజరు కాగా, 139 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో పి.ఉమారాణి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,716 మంది విద్యార్థులు హాజరుకాగా, 57 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విశాఖ నగరంలోని పవిత్ర ఒకేషనల్ జూనియర్ కాలేజీ, శంకర్ ఫౌండేషన్ జూనియర్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆర్ఐవో ఉమారాణి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా కేంద్రాల నిర్వాహకులు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట : జిల్లాలో, నగరంలో నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లోని క్లినిక్స్, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ - 2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రాండ్‌గా గ్రాంటు

- రెండో విడత నిధులు మంజూరు
- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.2.36 కోట్లు

విశాఖ విద్య: ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 4,944 పాఠశాలలకు రూ.2.36 కోట్లు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష డైరెక్టర్ సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా నిధులు కేటాయింపు చేశారు. వీటిని పాఠశాలల బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారులకు ఆదేశాలు అందాయి. 2022-23 విద్యా సంవత్సరానికి తొలి విడతలో గత ఆగస్టులో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 4,090 స్కూళ్లకు రూ.2.24 కోట్లు మంజూరయ్యాయి. సాంకేతిక కారణాలతో తొలివిడతలో కొన్ని పాఠశాలలకు నిధులు జమకాలేదు. ఇలాంటి వాటికి సైతం రెండో విడతలో నిధులు కేటాయింపు చేశారు. రెండో దఫా నిధులు సైతం సకాలంలోనే మంజూరు చేయటం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా మంజూరైన నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
విశాఖపట్నం	579	39.22
అనకాపల్లి	1,467	78.47
అల్లూరి	2,898	118.40
మొత్తం	4,944	236.09

పూజారి దాటి వెళితే.. కష్టాలు గట్టెక్కినట్టే

- భక్తిశ్రద్ధలతో నూకతాత పండగ
- రోడ్డుపై పడుకుని మొక్కుల చెల్లింపు



భక్తులను దాటుకుంటూ వెళుతున్న పూజారులు

నక్కపల్లి: వింత ఆచారం, వినూత్న సంప్రదాయంతో నూకతాత పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి తర్వాత వచ్చే అమావాస్య రోజున మత్స్యకారులు ఈ వేడుకను జరపడం ఆనవాయితీ. నూకతాతను గంగపుత్రులు తమ కులదైవంగా భావిస్తారు. తొలుత నూకతాత విగ్రహాలను సముద్రస్నానానికి తీసుకెళ్లారు. తిరిగి ఆలయానికి విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో భక్తులు రోడ్డుపై పడుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా రోడ్డుపై పడుకున్న భక్తులపై నుంచి విగ్రహాలను చేతపట్టిన పూజారులు దాటుకుంటూ వెళ్లారు. ఇలా పడుకుని మొక్కులు చెల్లించుకోవడం ద్వారా తమ కోర్కెలు నెరవేరుతాయనేది మత్స్యకారుల నమ్మకం. నూకతాత పండగను పురస్కరించుకుని గ్రామంలో పెద్ద తిరునాళ్లు జరిగింది. భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. బాణసంచా కాంతులు మిన్నంటాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా నూకతాత పండక్కి రాజయ్యపేట చేరుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గంగపుత్రుల ఇళ్లన్నీ కళకళలాడాయి. నూకతాత ఆలయాన్ని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దర్శించుకున్నారు.



సముద్ర స్నానం అనంతరం విగ్రహాలను ఆలయానికి తీసుకువస్తున్న పూజారులు



నూక తాత విగ్రహాన్ని తలపై పెట్టుకుని ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడు మృతి




ఆస్పత్రిలో చక్రయ్య మృతదేహం, చక్రయ్య (ఫైల్)

నక్కపల్లి : సముద్రస్నానానికి వెళ్లిన యువకుడు కెరటాల తాకిడికి మునిగిపోగా, పక్కన ఉన్న వారు గుర్తించి బయటకు తీసి, కొన ఊపిరితో ఉన్న అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. సోమవారం జరిగిన ఘటన వివరాలివి. మాస శివ రాత్రి సందర్భంగా బోయపాడులో జరిగిన సముద్రస్నానాలకు ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన పోతంశెట్టి చక్రయ్య (20) స్నేహితులతో కలసి వెళ్లాడు. స్నానం చేస్తుండగా కెరటాలు ఉధృతంగా రావడంతో మునిగిపోయాడు. వెంటనే స్థానికులు అతన్ని బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న ఆ యువకుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. డిగ్రీ చదువుకున్న చక్రయ్య ఆదివారం జరిగిన ఎస్ఐ పరీక్షలకు హాజరయ్యాడు. మృతుడి సోదరుడు కూడా రెండేళ్ల క్రితం బావిలో పడి దుర్మరణం పాలయ్యాడు. ఇతని తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కొడుకు మరణ వార్త తెలిసి వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనలో 159 అర్జీల నమోదు

తుమ్మపాల: స్పందనకు వచ్చే దరఖాస్తులను మరింత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ వారం మొత్తం 159 అర్జీలు నమోదయ్యాయి. జేసీ కల్పనాకుమారి, డీఆర్వో పి.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంతిల్లు లాగేసుకున్నారని ఫిర్యాదు

బుచ్చెయ్యపేట మండలం మల్లాంలో శాశ్వత గూడు కల్పించకుండా పంచాయతీ పాలకులు, అధికారులు



నమ్మి సత్యవతి, ఆమె కుమార్తెలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి

మా సామగ్రిని విసిరేశారని, తమపై దాడులు చేస్తున్నారని గ్రామానికి చెందిన నమ్మి సత్యవతి తన ముగ్గురు కుమార్తెలతో స్పందనలో విన్నవించుకుంది. తమ ఇంటిని పదేళ్ల క్రితం నూతన పంచాయతీ భవన నిర్మాణానికి అప్పటి సర్పంచ్ గొలగాని అచ్చితల్లి తీసుకుని, మరో చోట కొత్త ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

అంతవరకు ఖాళీ పాత పంచాయతీ భవనంలో నివాసం ఉండేందుకు 2010లో ఒప్పంద కాగిత పత్రం ఇచ్చారు. ఇప్పటికీ మరో చోట ఇల్లు నిర్మించి ఇవ్వలేదని వాపోయింది.

నా మరిది పేరున ఓటీఎస్ ఇచ్చారు

2003లో నేను నిర్మించుకున్న ఇంటికి నా మరిది పేరున ఓటీఎస్ ఇచ్చారని, దాన్ని రద్దు చేసి నాపేరున మంజూరు చేయాలని నర్సీపట్నం మండలం పెద్దబొడ్డేపల్లి చెందిన పోతురాజు వరహాలమ్మ స్పందనలో విన్నవించుకుంది. నా భర్త మరణించాడని, నేను, నా కుమారుడు నివసిస్తున్న ఇంటిని నా మరిది పేరున ఓటీఎస్ ఇవ్వడంపై పలుమార్లు ఫిర్యాదు చేశానని వివరించింది. ఇప్పటికైనా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరింది.

బ్రాండిక్స్ పైప్‌లైన్ లీక్‌లతో చేపలు మృత్యువాత

బ్రాండిక్స్ కంపెనీ సముద్ర గర్భంలోకి చేపడుతున్న రెండో పైప్‌లైన్స్ లీకేజీలతో చేపలు మృతి చెంది ఉపాధి కోల్పోతున్నామని పూడిమడక గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2011లో జేఏసీ కమిటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మొదటి పైప్ లైన్ నష్టపరిహారం చెల్లించి, తదుపరి రెండో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సముద్రంలో చేపల మృతికి పైప్‌లైన్ లీకేజీలే కారణమని సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసిందన్నారు. ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరికి రూ.2.70 లక్షల చొప్పున 370 మందికి పరిహారం చెల్లించాలన్నారు. ఈ అంశమై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 34 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 34 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ గౌతమిసాలి సోమవారం తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలను తెలుసుకుంటూ కింద స్థాయి సిబ్బందిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని, ముఖ్యంగా ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు వంటిపై అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అటవీ సిబ్బందిపై విజిలెన్స్ డీఎఫ్‌వో విచారణ



స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ

నర్సీపట్నం : ఒకే సామిల్లుకు లోపాకారి ఒప్పందం మేరకు అధికమొత్తంలో అటవీ అధికారులు పర్మిట్లు మంజూరు చేశారని ఒక అజ్ఞాత వ్యక్తి ఏడాది క్రితం సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో ఎం.రవిశంకర్ శర్మ సోమవారం నర్సీపట్నం అటవీ రేంజ్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అప్పట్లో ఇక్కడ రేంజర్‌గా పని చేసి ప్రస్తుతం విజయనగరం జిల్లాలో రేంజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బొత్సా అప్పలరాజు, అప్పట్లో పని చేసిన సిబ్బంది సతీష్, నూకరాజును, కరుణ సామిల్లు యజమాని చింతల అప్పలనాయుడుని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. విజిలెన్స్ డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి కరుణ సామిల్లుకు మాత్రమే కలప రవాణా చేసేలా పరోక్షంగా అధికారులు సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలు స్పష్టంగా లేవన్నారు. అయినప్పటికీ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. అనంతరం ప్రస్తుత డీఎఫ్‌వో రాజారావు, రేంజర్ లక్ష్మీనర్సుతో సమావేశమయ్యారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



వెంకటేశ్వరరావు (ఫైల్)

నాతవరం: గుమ్మడిగొండ గ్రామానికి చెందిన ఆడబాల వెంకటేశ్వరరావు(44) అనే వ్యక్తి అదృశ్యమైనట్టు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.లక్ష్మినారాయణ అందించిన వివరాలివి. వ్యవసాయదారు అయిన వెంకటేశ్వరరావు ఇటీవల గ్రామ సమీపంలో తాండవ నది ఒడ్డున గల జీడితోటలోకి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అయితే సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు కూడా ఇంటికి రాకపోవడంతో బంధువులను ఆరా తీసినా వెంకటేశ్వరరావు ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటేశ్వరరావు 5.6 అడుగులు ఎత్తు చామనఛాయ రంగు ఉంటారని, చుక్కల రంగు షర్ట్ లుంగీ ధరించి ఉంటారని, ఆచూకీ తెలిసిన వారు 9100011130, 8332970770, 08932-287633 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సీతయ్యపేట విద్యార్థి



లోకేష్

బుచ్చెయ్యపేట: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి. లోకేష్ ఎంపికయ్యాడు. ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 66వ రాష్ట్ర స్థాయి అండర్ -14 ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో అత్యధిక ప్రతిభ కనబరిచిన లోకేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం ఎ.వి. జగన్నాథరావు, పీడీ దాడి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. త్వరలో జాతీయ స్థాయి ఖోఖో జట్టుకు లోకేష్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారన్నారు. లోకేష్‌ను సోమవారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, ఎంపీటీసీ గోకివాడ రాము, సర్పంచ్ వజ్రపు ఇందిర శ్రీనివాస్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ వజ్రపు బాబూరావు అభినందించారు.

పెద్దేరులో మహిళ మృతదేహం

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద పెద్దేరు నదిలో మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు కె.జె.పురం గ్రామానికి చెందిన మహిళగా నిర్ధారించారు. పెద్దేరు నదిలో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కుమారస్వామి తమ సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. 50 నుంచి 60 ఏళ్ల వయసు గల మహిళ మృతదేహాన్ని పంచనామా చేసి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసి మృతురాలి కుటుంబీకులు పోలీసులను సంప్రదించగా వివరాలు తెలిసాయి. మృతురాలి పేరు వద్దాది సావిత్రి. ఆమె కె.జె.పురం 2 వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తూ 2021 ఆగస్టులో ఉద్యోగ విరమణ చేశారు. ఆమె భర్త ఏడాది క్రితం కరోనా సమయంలో మృతి చెందినట్టు సావిత్రి కుటుంబ సభ్యులు తెలిపారుజ. ఈనెల 19వ తేదీ ఆదివారం మధ్యాహ్నం కె.జె.పురం కాలనీలో ఒక ఫంక్షన్‌లో భోజనం చేసిన తర్వాత అమె కనిపించలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నుంచి అమె అచూకీ కోసం తిరిగారు. ఇంతలో గుర్తు తెలియని శవం విజయరామరాజుపేట వద్ద పెద్దేరు నదిలో లభించిందన్న సమాచారం తెలియడంతో వారు బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు.సావిత్రి మృతిచెందినట్టు తెలిసి ఆవేదనకు గురయ్యారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోటవురట్ల: నరసింగబిల్లి-బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి సోమవారం సాయంత్రం అక్కడికక్కడే మృతి చెందారు. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాలివి. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల గుర్తు తెలియని 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి వివరాలు కూడా తెలియరాలేదు. మృతుడి శరీరంపై లుంగీ, చొక్కా ఉన్నాయి. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9490619020, 9494887786 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరి గాయాలు

పెదబయలు : సీకరి పంచాయతీ పన్నెడ గ్రామ సమీపంలో సోమవారం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు అంచు దిగడంతో తునికి చెందిన అనపర్తి విజయ్‌కుమార్ (30) తీవ్రంగా గాయపడ్డాడు. పెదబయలు వారపు సంతకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

స్వీట్ దుకాణంపై కేసు నమోదు

అనకాపల్లిటౌన్ : బేకరీలు, రహదారులపై తినుబండారాలు ఆరగించే వ్యక్తులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, లేని పక్షంలో వివిధ రకాలైన వ్యాధుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుందని జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ పి.రవికుమార్ అన్నారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో రాజస్థాన్ స్వీట్ స్టాల్లో వంటకాలకు వాడుతున్న వంటనూనెను ఆయన సోమవారం తనిఖీ చేసి కేసు నమోదు చేశారు. వంటకాలు తయారు చేస్తున్న నూనె నిబంధనల ప్రకారం 25 శాతానికి మించి ఉండకూడదని తెలిపారు. రాజస్థాన్ స్వీట్‌షాప్‌ల్లో వంటకాల్లో 40 శాతం వినియోగిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు స్వీట్‌షాప్ యజమానిపై కేసు నమోదు చేసి చేసినట్టు తెలపారు.

దివ్యాంగుల సమాఖ్య నిధులు పక్కదారిపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న వెలుగు శాఖ డీపీఎంలు శ్రీనివాసరావు, వరప్రసాద్

రోలుగుంట: దివ్యాంగుల సమాఖ్య నిధులు పక్కదారి పట్టినట్టు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని వెలుగు శాఖ డీపీఎంలు శ్రీనివాసరావు, వరప్రసాద్ వెల్లడించారు. 2006 సంవత్సరానికి సంబంధించి వెలుగు ద్వారా దివ్యాంగుల జీవనోపాధి కోసం ప్రభుత్వం మంజూరు చేసి, ఆయా సంఘాలకు పంపిణీ చేసిన రూ. 43 లక్షలు పక్కదారి పట్టాయని ముప్పెన వెంకటరమణ అనే వ్యక్తి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై స్పందించిన అధికారులు ఈ నెల 17న శుక్రవారం నాడు స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చి అప్పటి ఏపీఎంలు, ఎంసీపీలతో ఆ శాఖ డీపీఎంలు శ్రీనివాసరావు, వరప్రసాద్ చర్చించారు. సోమవారం రూ.43 లక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదులో పేర్కొనట్టుగా ఆయా గ్రామాల్లో సంఘాల వారీగా సభ్యులను నేరుగా కలసి విచారణ చేసేందుకు క్లస్టర్ల వారీగా నాలుగు బృందాలను వేసి ఆయా గ్రామాలకు సోమవారం పంపించామన్నారు. సభ్యులను కలసి వారితో చర్చించి నివేదికలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రౌడీల నుంచి రక్షణ కల్పించండి



వినతి పత్రం ఇచ్చేందుకు డీఐజీ కార్యాలయానికి వచ్చిన వెంకటస్వామి కుటుంబ సభ్యులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు) : తమ భూములు ఆక్రమించుకునేందుకు తామపై రౌడీలతో దాడులు చేస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని అచ్చుతాపురం మండలం భోగాపురం గ్రామానికి చెందిన పైల వెంకటస్వామి డీఐజీ హరికృష్ణను కోరారు. ఈ మేరకు సోమవారం సిరిపురంలోని డీఐజీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దుప్పుతూరు గ్రామ పంచాయతీలో సుమారు 32 ఎకరాల భూమిని 20 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. అయితే తమ భూమిపై హక్కు కోరుతూ విశాఖపట్నంకు చెందిన పి.ఆర్.ఎస్ నాయుడు మరికొంత మంది జిల్లా కోర్టులో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దీనిపై విచారణ కొనసాగుతుందని అయితే ఈ నెల 6 తేదీన లాలం రాంబాబు, పి.ఆర్.ఎస్.నాయుడు కలిసి 300 మంది కిరాయి గూండాలతో తమ భూమిపైకి దౌర్జన్యంగా ప్రవేశించి దాడి చేశారని తెలిపారు. ఈ దాడిపై అచ్చుతాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సీఐ మురళీరావు దృష్టికి తీసుకొని వెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమ గ్రామానికి తిరిగి వెళ్తే దాడులు చేస్తారని భయంతో విశాఖలో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పించి తమపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఐజీ హరికృష్ణ అనకాపల్లి ఎస్పీకి ఫోన్ చేసి నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు.

డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్

- రౌడీషీటర్ హేమంత్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- వారితోపాటు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.7.75 లక్షలు, 11 ఫోన్లు, 2 కార్లు స్వాధీనం

దొండపర్తి (విశాఖ దక్షిణ): సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పోజు మధుసూదనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్ కోలా వెంకట హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు మొత్తం 11 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ డబ్బు కోసమే మధుసూదనరావును కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి రూ.11.75 లక్షలు తీసుకోగా... కిడ్నాపర్లలో ఒకరికి డబ్బులు ఇస్తానని చెప్పి, అతడి సహకారంతో కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకొని ఈ నెల 17వ తేదీన పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు వివరించారు. ఆయన వివరాల ప్రకారం..

పెద రుషికొండ ప్రాంతానికి చెందిన కొప్పోజు మధుసూదనరావు స్టాక్ ట్రేడింగ్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి 2020లో భీమిలికి చెందిన రౌడీషీటర్ కోలా వెంకటహేమంత్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురూ కొన్నాళ్లు రియల్ ఎస్టేట్ లావాదేవీలు సాగించారు. హేమంత్‌కుమార్‌పై గతంలో కూడా కిడ్నాప్ కేసు ఉండగా... గంజాయి కేసులో అరెస్ట్ అయి గత నెల 13నే బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. ఇదిలా ఉంటే మధుసూదనరావుకు చెందిన ఒక విల్లాను ఇటీవల విక్రయానికి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న హేమంత్‌కుమార్ అతడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు.

జైలులో పరిచయమైన కానిస్టేబుళ్లతో కలిసి..

మధుసూదనరావు కిడ్నాప్ ప్లాన్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు మన్యం జిల్లాకు చెందిన జీరెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన కానిస్టేబుల్ బింపోలు రాంబాబు సహకరించారు. వీరిద్దరూ గంజాయి కేసులో అరెస్టయి జైలుకు కూడా వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. హేమంత్‌కుమార్ కూడా గంజాయి కేసులో అరెస్టవడంతో జైలులోనే కానిస్టేబుళ్లతో పరిచయం ఏర్పడింది. బయటకు వచ్చాక హేమంత్‌కుమార్ వారితోపాటు దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న గంధవరపు తరుణ్‌కుమార్(32), మరో ఏడుగురికి మధుసూధనరావు గత నెల 28న పెద రుషికొండలో కిడ్నాప్ ప్లాన్ చెప్పాడు. ఇందులో ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తానని చెప్పి, అడ్వాన్స్‌గా రూ.5 వేలు చొప్పున ఇచ్చాడు.

విల్లా కొనుగోలుకు పార్టీ ఉందని నమ్మించి...

విల్లా కొనుగోలుకు తన వద్ద పార్టీ ఉందని మధుసూదనరావును హేమంత్‌కుమార్ నమ్మించాడు. 15వ తేదీన పార్టీని కలుద్దామని చెప్పడంతో మధుసూధనరావు ఆ రోజు ఉదయం తన కారులో బాలాజీ బే మౌంట్ రోడ్డుకు వెళ్లాడు. అక్కడ హేమంత్ కుమార్ మరో ఇద్దరు ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్న(19)తో కలిసి కారులో వేచి ఉన్నాడు. అక్కడి నుంచి నలుగురు కారులో బయలుదేరారు.

కాళ్లు.. చేతులు కట్టేసి..

కొంత దూరం వెళ్లేసరికి ప్రసాద్, చిన్న కలిసి మధుసూధనరావు కాళ్లు, చేతులు కట్టేసి అతని వద్ద ఉన్న బంగారం గొలుసు, 2 ఉంగరాలు కాజేశారు. నగర శివారు ప్రాంతంలో ఉన్న ఒక లే అవుట్‌కు తీసుకెళ్లి హేమంత్‌కుమార్ రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత డబ్బు తన వద్ద లేదని, తన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.4 లక్షలను హేమంత్ కుమార్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ డబ్బులు సరిపోవని మరో రూ.8 లక్షలు ఇవ్వాలని హేమంత్ డిమాండ్ చేశాడు. దీంతో మధుసూదనరావు ఈ నెల 16న తన భార్య వద్ద ఉన్న బంగారు నగలను తన స్నేహితుడు జగదీష్ ద్వారా బ్యాంకులో తాకట్టుపెట్టి డబ్బులు ఇప్పించాడు. అలాగే మధుసూదనరావు చైన్, ఉంగరాలను ఎస్.కోటలో ఉన్న మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.1.8 లక్షలు తీసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న మొబైల్స్, నగదు

కిడ్నాపర్లలో ఒకరికి డబ్బు ఇస్తానని బయటపడి..

మధుసూదనరావు డబ్బులు ఇచ్చినప్పటికీ అతడిని కిడ్నాపర్లు విడిచిపెట్టలేదు. హేమంత్ కుమార్‌తోపాటు మరికొంత మంది బయటకు వెళ్తూ మధుసూదనరావుకు కాపలాగా ఒకరిని పెట్టారు. వారు వెళ్లిన వెంటనే కాపాలాగా ఉన్న వ్యక్తికి డబ్బులు ఇస్తానని, తనను పంపించేయాలని కోరడంతో అతడు వదిలేశాడు. దీంతో వారి చెర నుంచి బయటపడి ఈ నెల 17న పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రత్యేక బృందాల దర్యాప్తుతో 11 మంది అరెస్ట్

మధుసూదనరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ - 1 సుమిత్ సునీల్ గరుడ కేసును స్వయంగా పర్యవేక్షించారు. 10 బృందాలను ఏర్పాటు చేసి కిడ్నాపర్ల కోసం గాలించారు. మధుసూదనరావు బ్యాంక్ ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాల వివరాలు, ఇతర సాంకేతికతతో కిడ్నాపర్లను పోలీసులు గుర్తించారు.



మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

అసలు కిడ్నాపర్ హేమంత్‌కుమార్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి గోవాకు పారిపోయాడు. పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా హేమంత్‌కుమార్‌తోపాటు మొత్తం 11 మంది కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో కోలా హేమంత్‌కుమార్, ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్నా (19), కేడీ పేటకు చెందిన సుర్ల నాగ గణేష్ (21), దొండపర్తికి చెందిన దమ్ము శరత్‌తేజ(21), దమ్ము సాగర్ శ్రీనివాస్(22), మన్యం జిల్లాకు చెందిన జెర్రెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన బింపోలు రాంబాబు, వడ్లపూడికి చెందిన గంధవరపు తరుణ్ కుమార్(32), అనకాపల్లికి చెందిన బలిరెడ్డి నానాజీ(25)లను సోమవారం అరెస్ట్ చేశారు. గంధవరపు తరుణ్‌కుమార్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రెండు జతల పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. హేమంత్‌కుమార్‌పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీకాంత్ చెప్పారు. అలాగే కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్ల అప్పలనాయుడు, రాంబాబుపై కూడా రెండేసి కేసులు ఉన్నట్లు వివరించారు.

సీపీ శ్రీకాంత్ అభినందన

కిడ్నాప్ కేసును ఛేదించి కిడ్నాపర్లను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అభినందించారు. నార్త్ ఏసీపీ సీహెచ్.శ్రీనివాసరావు, పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ, భీమిలి సీఐ కె.లక్ష్మణ మూర్తి, ఎస్ఐలు సీహెచ్.వెంకటరావు, ఎన్.సునీత, ఎ.హర్ష, బి.నరసింహమూర్తి, ఇతర నార్త్ సబ్ డివిజన్ సిబ్బందిని ప్రశంసించారు.

క్లుప్తంగా

ప్రత్యేక ఆకర్షణగా శివపార్వతుల శక్తిపీఠాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి జయవీర్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయ కాలక్షేప మండపంలో భూగోళం చుట్టూ శివపార్వతుల అష్టాదశ శక్తిపీఠాల గోడపత్రికను ఆవిష్కరించారు. మాలధారణ సంఘం వ్యవస్థాపకుడు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఖోఖో సంఘ వ్యవస్థాపకుడు దాడి జయవీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివపార్వతుల శక్తిపీఠాలు ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లయ్య కాలువను శుభ్రం చేయాలి



చెత్తాచెదారంతో నిండి ఉన్న కాలువ

తుమ్మపాల : పట్టణంలోని ఉడ్‌పేట, వేల్పులవీధి ఆనుకుని విస్తరించిన ఎల్లయ్య కాలువ చెత్తాచెదారంతో అత్యంత దారుణంగా ఉందని, అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పూర్తిగా చెట్లు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో కాలువ నిండిపోయి మురుగు ప్రవాహం నిలిచిపోయిందన్నారు. దోమలు వృద్ధి చెంది, స్థానికులు రోగాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలువను శుభ్రం చేయాలని కోరారు.

రేపు ఉపమాక వెంకన్న పెళ్లిరాట

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 22న బుధవారం పెళ్లిరాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి(మార్చి3)న స్వామివారి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పెళ్లిరాట కార్యక్రమానికి ఈనెల 22న ఉదయం 7.58 గంటలకు ముహూర్తంగా టీటీడీ ఆగమ శాస్త్ర పండితులు నిర్ణయించారన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 16,155బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,510	4,070
మొదటి రకం	3,360	3,600
రెండో రకం	3,060	3,450
మూడో రకం	2,800	3,050

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
క్యాంటమేనియా(3డీ)	- సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	-షిర్డిసాయి
క్యాంటమేనియా(3డీ)	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	- శ్రీసత్య
వాల్తేర్ వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 492 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 458 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఈ క్రాప్‌తో రైతుకు భరోసా

- సబ్ డివిజన్‌లో ముమ్మరంగా ఈ క్రాప్ నమోదు
- పొలం వద్దనే రైతుల నుంచి సమాచార సేకరణ
- వ్యవసాయ పథకాలకు ఈ క్రాప్ తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. ఆర్బీకేల ద్వారా రైతాంగానికి విశేష సేవలను అందిస్తోంది. పంటలను సకాలంలో సాగు చేసుకునేందుకు వీలుగా పెట్టుబడి కింద రైతు భరోసా సాయం వారి ఖాతాల్లో జమచేస్తోంది. విత్తనం మొదలుకొని పంట దిగుబడి చేతికొచ్చే వరకూ అన్ని రకాల సేవలు అందిస్తోంది. దీంతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ఈ క్రాప్ నమోదు చేస్తోంది.



అనకాపల్లి ప్రాంతంలో రబీ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి రూరల్: ఈ క్రాప్ నమోదు ప్రక్రియ అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఊపందుకుంది. ఎక్కడా అవకతవకలకు తావులేకుండా వ్యవసాయ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పంట నమోదు గడువు సమీపిస్తుండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి డివిజన్ స్థాయి అధికారుల వరకు శత శాతం నమోదు లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

సబ్ డివిజన్‌లో రబీ సాగు జోరు

సబ్ డివిజన్‌లోని అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్లో 3,436 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో వరి, మొక్కజొన్న, సజ్జలు, మినప, పెసర, నువ్వులు, కందులు, సన్‌ఫ్లవర్ తదితర పంటలు సాగులో ఉన్నాయి. వీటిలో ఏయే పంటలు ఎంత మేర సాగయ్యాయనే వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరీ కల్చర్ అసిస్టెంట్లు సేకరిస్తున్నారు. వీరు నేరుగా రైతులు సాగు చేసిన పంట పొలాల వద్దకే వెళ్లి ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు.

ముమ్మరంగా నమోదు

సబ్‌డివిజన్ పరిధిలో రబీ సాగు	: 3,436 ఎకరాలు
ఈ క్రాప్ నమోదైన విస్తీర్ణం	: 3,071 ఎకరాలు
ఈ క్రాప్ నమోదు శాతం	: 90 శాతం

అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ప్రస్తుతం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. రబీలో 3,436 ఎకరాల సాగుకు గానూ, ఇప్పటి వరకూ 3071 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తి చేశారు. ఈ క్రాప్ నమోదు కోసం రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్లు, భూమికి సంబంధించిన వివరాలు ఇస్తే వీఏఏలు ఆధార్‌బేస్ డేటాను అనుసంధానం చేసి, ఈ క్రాప్ నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు పర్యవేక్షిస్తున్నారు.

ఈ క్రాప్‌తో ప్రయోజనాలు

ఈ క్రాప్ నమోదువల్ల వరదలు, తుపానుల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. అంతేగాక పంటల బీమా రావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా, రాయితీపై విత్తనాలు తీసుకోవాలన్నా ఈ–క్రాప్‌లో పంట నమోదు తప్పనిసరి. పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ పూర్తిచేసి ఉండాలి.



వెంకుపాలెంలో ఈ క్రాప్ నమోదులో రైతు వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఐదు రోజులే గడువు



రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇందుకు ఫిబ్రవరి 25 వరకు మాత్రమే గడువుంది. ఇప్పటి వరకూ 90 శాతం నమోదు పూర్తయింది. ఇంకా ఈ –క్రాప్ నమోదు చేసుకోని రైతులు తప్పనిసరిగా తమ వివరాలనను నమోదు చేయించుకోవాలి. లేకుంటే ప్రభుత్వం నుంచి రావాల్సిన వ్యవసాయ సంక్షేమ ఫలాలకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ప్రతీ రైతు దీనిని గమనించి సహకరించాలి.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయాధికారి, అనకాపల్లి

ధర తగ్గిన టమాటా

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.25 నుంచి రూ.30కి విక్రయించగా, ఈ వారం రూ.20కి విక్రయాలు సాగాయి. ఇక ఉల్లి కూడా అదే ధరకు అమ్మకాలు జరిగాయి. బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, వంకాయ, క్యారెట్, బీట్‌రూట్, దొండకాయ రూ.40, బెండకాయ, బీర, కాకర రూ.60, క్యాప్సికం రూ.80, బీన్స్ పిక్కలు రూ.100కు విక్రయాలు సాగాయి. గోబీ పువ్వు సైజ్‌ను బట్టి ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయించారు.

26 నుంచి సాయిబాబా మందిరం వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్ : ఈనెల 26, 27, 28 తేదీల్లో వేల్పులవీధి శ్రీసాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు మత్స్యలింగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం నుంచి బాబా వారికి క్షీరాభిషేకం, సహస్ర పుష్పార్చన, మధ్యాహ్నం అన్నసమారాధన జరపనున్నట్టు పేర్కొన్నారు. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కశింకోట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కశింకోటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటును రమాప్రభకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు ప్రారంభం



అనకాపల్లి బైపాస్ నుంచి బొజ్జన్నకొండ జంక్షన్ వరకు పూర్తయిన బ్రిడ్జి

తుమ్మపాల : అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి బొజ్జన్నకొండ జంక్షన్ వరకు గల బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. నిర్మాణ కాంట్రాక్టర్ డీబీఎల్ సంస్థ బ్రిడ్జి పనులు పూర్తిచేయడంతో సోమవారం నుంచి బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. పంటపొలాల మధ్య నుంచి సమారు రెండు కిలోమీటర్ల పొడవు గల బ్రిడ్జి ఏర్పాటుతో అనకాపల్లి పట్టణ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తొలగిపోనున్నాయి. ఇదివరకు విజయవాడ, విశాఖపట్టణం నుంచి వచ్చే భారీ వాహనాలు, సరకు రవాణా వాహనాలు అనకాపల్లి పట్టణంలోకి వచ్చి ఆనందపురం రహదారి వైపు వెళ్లేవి. ఇప్పుడు బ్రిడ్జి పూర్తికావడంతో వాహనాలు నేరుగా ఆనందపురం రహదారికి చేరుకుంటున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ కింద జంగిల్ క్లీనింగ్, పాత ఇనుప స్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాల ఏర్పాటు నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ ఎస్.రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ జంక్షన్, రింగ్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, చిన్నవీధి, చేపలమార్కెట్ ఏరియా, నెయ్యిలవీధి, ఆమంచివారివీధి, లక్ష్మీనారాయణనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.


మాతృ భాషను నిర్లక్ష్యం చేయొద్దు



తెలుగు భాష పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

అనకాపల్లి రూరల్ : తెలుగు భాషపై నిర్లక్ష్య ధోరణి కారణంగా నేటితరం విద్యార్థులకు తెలుగు సరిగా రాయడం, చదవడం రావట్లేదని తెలుగు భాషా పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహనరావు అన్నారు. సోమవారం అనకాపల్లి గురజాడ స్కూల్‌లో తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు వి.లహరి, బి.దీక్షిత, ఎం.రూప స్వాతి, కె.జాన్విత, డి.భవ్యశ్రీ, భాను శివశ్రీ, డి.కుమార్‌లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో నిరాదరణకు గురవుతున్న మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేందుకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భావితరాలకు తెలుగు లిపి దూరం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పలువురు వక్తలు తెలుగు సాహిత్యం, పద్యాలకున్న ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జి.రంగబాబు, అమర జ్యోతి, గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ హేమలత, మోహన్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీహరిసేన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఇంటింటా గోవిందుడు 1008 కార్యక్రమంలో భాగంగా కల్యాణోత్సవం నిర్వహించినట్టు సమితి వ్యవస్థాపకురాలు దాడి రాజేశ్వరి పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను గవరపాలెం పురవీధులగుండా ఊరేగించారు. స్వామివారి కల్యాణమహోత్సవంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీగా అన్నసమారాధన చేశారు.

హైవేపై జంగిల్ క్లియరెన్స్



డివైడర్‌పై జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్ : జిల్లాలోని అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకూ విస్తరించి ఉన్న హైవే డివైడర్‌పై జంగిల్ క్లియరెన్స్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. హైవే మధ్య డివైడర్‌పైనున్న పలు మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. చాలా చోట్ల ఈ డివైడర్లనానుకుని ఉన్న కొన్ని మొక్కలు గుబురుగా పెరిగిపోయాయి. దీంతో ఈ మొక్కలు మరింత పెరగకుండా కత్తిరించే పనిలో ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది బిజీగా వున్నారు. అంతేగాకుండా వర్షాలు పడ్డాక ప్లాంటేషన్ పనులు కూడా చేపడతామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్పారు.

22, 23 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు



హాజరైన వివిధ కమిటీల ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖ ఏడీ ఆదారి రవిబాబు అన్నారు. స్థానిక జీవీఎంసీ మెయిన్ హైస్కూల్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రారంభించనున్నట్టు తెలిపారు. మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపికైన విద్యార్థులు బుధవారం(22న) ఉదయం 7 గంటల్లోపు జిల్లాస్థాయి ప్రదర్శనకు తమ నమూనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ప్రాజెక్టుకు కేటాయించిన గదుల్లో వారి నమూనాలను ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఒక్కో ప్రాజెక్టుకు విద్యార్థితోపాటు ఒక గైడ్ టీచర్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, ఏపీవో వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ అధికారి ఎస్.ప్రసాద్, ఎంఈవో డి.దివాకర్, హెచ్‌ఎం బ్రహ్మాజీ, సైన్స్‌ఫెయిర్ కమిటీల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీయే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ : త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటరు జాబితా, ఓటింగ్‌పై సభ్యులకు దిశానిర్దేశం చేశారు. వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు సీహెచ్ ముత్యాలు, పెదిశెట్టి శేఖర్, కలపాక సర్పంచ్ బొండా కనకారావు, కె.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు



పాటిపల్లిలో ప్రభుత్వ భూమి రికార్డుల పరిశీలన

మునగపాక : ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ హెచ్చరించారు. పాటిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.79, 80లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు అందిన ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం సర్వే చేయించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'వివాదాస్పద స్థలం హద్దులు గుర్తించండి'

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో వివాదాస్పదంగా మారిన ఆర్ అండ్ బీ రహదారి హద్దులు నిర్ణయించి పరిష్కార మార్గం చూపాలని రోడ్లు భవనాల శాఖ ఏఈ లలిత సోమవారం తహసీల్దార్ ప్రకాశరావును కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డును ఆనుకొని గ్రామ పంచాయతీ పాలకవర్గం సీసీ కల్వర్టు నిర్మించాలని యోచించింది. ఇంతలో కల్వర్టు నిర్మాణం చేపడుతున్న స్థలం తనదంటూ మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అడ్డు తగిలారు. దీంతో నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని ఏఈ లలిత కోరారు. ఏఈ వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకుడు బండారు రాజశేఖర్ ఉన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం పోర్ట్‌కో లేఅవుట్‌లోని కె.ఎస్.ఎన్. రాజు ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. వివరాలు. లేఅవుట్‌లో నివసిస్తున్న రాజు తన కుటుంబంతో ఈ నెల 16న కూతురు ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపర్చిన మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదని యజమాని రాజు సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తారకరత్న మృతి బాధాకరం



కశింకోటలో తారకరత్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట : ప్రముఖ సినీ నటుడు నందమూరి తారకరత్న పిన్న వయసులోనే మరణించడం బాధాకరమని టీడీపీ స్థానిక నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. కశింకోటలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, బసవతారకం దంపతుల విగ్రహాల వద్ద తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కందాల సురేష్, పార్టీకి చెందిన రెడ్డి త్రినాథ్, పెంటకోట తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో కేబీ రోడ్డుకు మోక్షం

- రూ.32 కోట్ల నిధుల కేటాయింపు
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు



కేబీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి రూరల్: ఏళ్ల తరబడి అధ్వాన స్థితిలో ఉన్న కేబీ రోడ్డు పనులకు మోక్షం లభించింది. గత టీడీపీ హయాంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకోలేదు. దీంతో వాహన చోదకులకు ఈ రోడ్డు నిత్యం నరకాన్ని చూపించింది. స్థానికుల విజ్ఞప్తి మేరకు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపింది. ప్రజల అవస్థల్ని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన గుడివాడ అమర్‌నాథ్ ఈ సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అభ్యర్థన మేరకు కేబీ రోడ్డు పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ.32 కోట్లు మంజూరు చేశారు. దీంతో సోమవారం రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తూరు కాలేజీ జక్షన్ నుంచి బంగారుమెట్ట వరకు రోడ్డు వేస్తున్నారు. పిసినికాడ పంచాయతీ పరిధి బీఆర్టీ కాలనీ వద్ద గతంలో ఈ పనులకు మంత్రి అమర్‌నాథ్ శకుస్థాపన చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్డు పనులను అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె ధర్మారావు, పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం పరిశీలించారు. కేబీ రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే సుమారు 20 గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మునగపాక ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మునగపాక మండలం పాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు నేషనల్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.